ప్రజాశక్తి

శనివారం 4, ఫిబ్రవరి 2023

5

శ్రీ సత్యసాయి



ట్యాబ్‌లు ఉపయోగించడం రాకుంటే ఎలా.?

ప్రజాశక్తి-చిలమత్తూరు

ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను వినియోగించడం ఎలాగో విద్యాశాఖ అధికారులకే తెలియకపోతే విద్యార్థులకు ఏం నేర్పుతారని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జిల్లా విధ్యాశాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలమత్తూరు మండలంలోని బీసి హాస్టల్‌ను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో ట్యాబ్‌ల వినియోగంపై ఆరాతీశారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి నుంచి సరైన స్పందన రాకపోవడవంతో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అయిఉండి ట్యాబ్‌లలో పాఠ్యాంశాలను ఎలా చూడాలి.? ఎలా వినియోగించాలో మీకే తెలియకుంటే ఇక విధ్యార్థులకు ఏం చెబుతారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరూ విధిగా ట్యాబ్‌లపై అవగాహన పెంచుకోవలని ఆదేశించారు.



ప్లటూన్ల గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

సమిష్టి విధులతో మెరుగైన సేవలందించండి

ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమిష్టి విధులతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పేర్కొన్నారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు 17 రోజుల పాటు నిర్వహించిన డీ మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జిల్లా కేంద్రం పుట్టపర్తి లోని స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పరిశీలన వాహనంపై వెళ్లి ఎఆర్ ప్లటూన్లను పరిశీలించారు. ఆ తర్వాత ప్లటూన్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. ఇందులో ఎఆర్ పోలీసుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉందంటే గతంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది త్యాగాలే కారణమన్నారు. ఎఆర్ సిబ్బందికి ప్రతి ఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం, ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఎఆర్ పోలీసుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యాంగా ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. అందులో భాగంగానే యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. వృత్తిగత నైపుణ్యాల పెంపునకు, ఆర్థిక క్రమశిక్షణ పై నిపుణులచే మొబిలైజేషన్‌లో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. బిడి టీం, ప్రిజనర్స్ ఎస్కార్ట్, పిఎస్ఒలు, డ్రైవర్లు, తదితర సిబ్బంది విధులు ఈకోవకు చెందినవే అన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగు పరుచుకోవాలని మెలకువలను సూచించారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని, నూతన జిల్లాలో పరిమిత వనరులతో డీ మొబిలైజేషన్ పరేడ్‌ను క్రమశిక్షణతో చక్కగా పూర్తి చేశారని పరేడ్ కమాండర్ టైటస్‌ను ఎస్పి అభినందించారు. మొబిలైజేషన్ ప్రక్రియలో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కెవి.రామకృష్ణ ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి విజయ్‌కుమార్ ఆర్ఐలు టైటస్, నారాయణ, ఆర్ఎస్ఐలు, ఎఆర్.సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు భరోసానిచ్చేరా..?

నేడు వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాకు రాక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో గడిచిన రెండేళ్లు గా అధిక వర్షాలు రైతులను నష్టాలపాలు జేస్తున్నాయి. 2022 ఖరీఫ్‌లోనూ అధిక వర్షాలతో వేరుశనగ, పత్తి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఏ మేరకు ఆదుకోనుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో నష్టపోయిన రైతులకు ఏదైనా భరోసా కల్పించే మాటను చెబుతారా అని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 2022 ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 16 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 11 లక్షల ఎకరాల వరకు వేరుశనగ సాగైంది. వాస్తవానికి వేరుశనగ సాధారణ సాగు 16 లక్షల ఎకరాలయితే గత కొంతకాలంగా ఈ సాగు తగ్గుతూ వస్తోంది. మంచి వర్షాలు పడినా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు ఆశించినంత పెరగలేదు. వేసిన పంట కూడా అధిక వర్షాలతో నష్టపోయారు. ఇక పత్తి పంట రెండు లక్షల ఎకరాలకుపైగా సాగైంది. ఈ పంటపై అధిక వర్షాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. కొన్ని చోట్ల నకిలీ విత్తనాలు కూడా రైతులను ముంచేశాయి. మిరపకు నల్లి తెగులుతో దిగుబడి తగ్గింది. అన్నిరకాలుగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఏ రకంగా ఆదుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు. ఈ పర్యటనలో మంత్రి రైతులకు పరిహారం అందించే విషయంపై ఏదైనా ప్రకటన చేస్తారేమోనని ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతు పరిస్థితి మరింత దయనీయం

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని చెబుతున్నా ఆచరణలో ఒట్టి మాటలుగానే ఉన్నాయి. గడిచిన మూడేళ్లుగా ఇచ్చిన కార్డులన్నీ కలిపి 7500 ఇచ్చినట్టు చూపుతున్నారు. అయినప్పటికీ వీరికి పంటరుణాలు గాని, పంట నష్టపరిహారం గాని అందే పరిస్థితులు లేవు. 2022-23వ ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులు జాయింట్ లయబులిటీ గ్రూపుగానున్న ఒక్క గ్రూపుకు రూ.1.15 లక్షలు మాత్రమే ఇచ్చారు. పరిహారం పరిస్థితి ఏ మాత్రం కౌలు రైతుకు దక్కడం లేదు.

సమస్యలు ఎక్కడి వక్కడే

వ్యవసాయ శాఖ పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. కనీసం మట్టి నమూనాలు పరీక్షించే ల్యాబొరేటరీలూ లేకుండాపోయాయి. మొబైల్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేసినా సిబ్బంది లేక అది కార్యాలయంలోనే మురుగుతోంది. ఇక ఇతర చోట్ల ఉన్నా అక్కడా సిబ్బంది కొరతతో ఆగిపోయి ఉన్నాయి. మండల వ్యవసాయాధికారుల కొరత వెంటాడుతోంది. ఒక్కో అధికారి రెండు, మూడు మండలాల ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. ఇక ఉద్యానవన శాఖలో ఏకంగా ఒక ఉద్యానవన అధికారికి 12 మండలాలు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. దీంతో రైతులకు ఏమైనా ఇబ్బందులొస్తే సలహాలిచ్చే వారు కూడా లేకుండాపోయారు. గ్రామ స్థాయిలోనే రైతులకు అవసరమైన తోడ్పాటు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఉన్న చోట కూడా ఎరువులు మినహా ఏవీ అందుబాటులో ఉండటం లేదు. ఇలా అనేక సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి.



నేడు వ్యవసాయ శాఖ మంత్రి రాక

వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి నేడు అనంతపురం జిల్లాకు రానున్నారు. ఎఎఫ్ ఎకాలజీ కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న రాయలసీమ ఎఫ్‌పిఒల సదస్సుల్లో ఆయన పాల్గొననున్నారు. అనంతపురం నగర శివార్లలోని విభిన్న ప్రతిభావంతుల కేంద్రంలోని అడిటోరియంలో ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సుల్లో వ్యవసాయ శాఖ మంత్రితోపాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీ, వ్యవసాయ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్, ఉద్యానవన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్.శ్రీధర్ పాల్గొంటున్నారు.

5న అప్పర్ భద్రా నిర్మాణంపై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అప్పర్ భద్రా నిర్మాణంతో జిల్లా నీటి వనరులకు ప్రమాదం అనే అంశంపై ఈ నెల 5వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం తుంగభద్ర డ్యాంపై భాగాన నిర్మిస్తున్న అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రాయలసీమ జిల్లాలకు ముఖ్యంగా అనంతపురం జిల్లాకు శాపంగా మారనుంది అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ పార్టీలు, మేధావులు, నిపుణులు అభ్యంతరాలు చెబుతున్నా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందించడం కేంద్ర ప్రభుత్వం వీటిని ఆమోదించిందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిందన్నారు. అంతర్జాతీయ సహజ నీటి సూత్రాలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టును కర్నాటక బిజెపి ప్రభుత్వం రూపొందించగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. త్వరలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి మన ప్రాంతాన్ని బలి పెడుతోందన్నారు. ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలో అప్పర్ భద్రాకు రూ.5300 కోట్లు కేటాయించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పోలవరానికి నిధులు ఇవ్వని కేంద్రం రాయలసీమ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేసే అప్పర్ భద్రా ప్రాజెక్టు నిధులు ఇవ్వడంపై రాయలసీమ రైతాంగంలో భయాందోళనలు కలిగిస్తోందన్నారు. రాయలసీమను ఎడారి కాకుండా కాపాడుకోవడానికి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, రైతులు వివిధ సంస్థలతో ఈ నెల 5న జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.



మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ అధికారులు

'జగనన్న విదేశీ విద్యాదీవెన'కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

కలెక్టరు బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జిల్లా వ్యవసాయ సలహా మండల ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం ఓడి.చెరువు మండలంలోని పగడాలవారిపల్లికి చెందిన ధర్మవరం అనిత, కొత్తచెరువు మండల కేంద్రంలోని బసన్నకట్ట వీధికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, పెనుకొండ మండలం కొండపల్లికి చెందిన భార్గవ సాయి అనే విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విదేశీ విద్యా దీవెన కింద మొదటి విడత గా ఆర్థిక సహాయాన్ని సిఎం విడుదల చేస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. వరల్డ్ యూనివర్సిటీ క్యూఎస్ డ్యామ్ కింగ్స్ ప్రకారం టాప్ 200 యూనివర్సిటీలను ఎంపికచేసి వాటిలో ప్రవేశం పొందితే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వందలోపు ర్యాంకు గల విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందితే ప్రభుత్వమే వంద శాతం ఫీజు చెల్లిస్తుందన్నారు. 101 నుంచి 200 ర్యాంకు కలిగిన వాటిల్లో ప్రవేశం పొందితే రూ.50 లక్షలు లేదా 50 శాతం ఫీజుల్లో ప్రభుత్వం భరిస్తుందన్నారు. విద్యార్థుల విమాన ఛార్జీలు, వీసాల వ్యయం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు పెంచి మరింత ఎక్కువ మందికి అవకాశం కల్పిస్తోందన్నారు. అనంతరం రూ.27.17 లక్షల మెగా చెక్కును కలెక్టరు, జెడ్‌పి ఛైర్మన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు, బిసి సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, పుట్టపర్తి ఎంపిపి ఎవి.రమణారెడ్డి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రశిక్ష ఎపిసి మాతృశాఖకు బదిలీ

ఇన్‌ఛార్జి బాధ్యతలు డీఈవోకు అప్పగింత ఉత్తర్వులు జారీ చేసిన ఎస్‌పిడి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఎపిసి) కె.తిలక్ విద్యాసాగర్‌ను మాతృశాఖ (కళాశాల విద్యాశాఖకు బదిలీ చేస్తూ ఎస్‌పిడి సురేష్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌ఛార్జి ఎపిసిగా జిల్లా విద్యాశాఖ అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఎపిసి కె.తిలక్ విద్యాసాగర్ రెగ్యులర్ బాటనీ లెక్చరర్‌గా కర్నూల్ జిల్లా ప్రభుత్వ డిగ్రీ ఫర్ మెన్ కళాశాలలో పనిచేస్తుండేవారు. ఆయన డిప్యూటేషన్ మీద కర్నూల్ జిల్లా సమగ్రశిక్ష పీవోగా ఎడాది పాటు పనిచేశారు. ఆ తర్వాత 2020 ఆగస్టులో అనంతపురం జిల్లాకు పీవోగా బదిలీ అయ్యారు. ఇప్పటికి మొత్తం మూడున్నర సంవత్సరాలు పాటు ఎపిసిగా విధులు నిర్వర్తించారు. ఈయనది కర్నూల్ జిల్లా సొంత ఊరు కావడంతో కుటుంబం అక్కడే ఉంది. ఈయన రాకపోకలు చేస్తున్నారు. ఇలా రాకపోకలు చేయడానికి ఇబ్బందిగా ఉందన్న ఉద్దేశంతో తనను మాతృశాఖకు రిప్యాట్రేషన్ చేయాలని ఇప్పటికి రెండు సార్లు ఎస్‌పిడికి లెటర్లు పెట్టుకున్నారు. అందులో భాగంగా ఆయన్ను మాతృశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన త్వరలో రిలీవ్ కానున్నారు.

తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

తాను రెండున్నర సంవత్సరాల పాటు అనంతపురం జిల్లా సమగ్రశిక్ష ఎపిసిగా విధులు నిర్వర్తించానని తిలక్ విద్యాసాగర్ తెలిపారు. తనకు ఇప్పటి వరకు కలెక్టర్, జెసి, ఎస్‌పిడి, ఆర్‌జెడి, డిఇఒ, ఇతర ఉన్నతాధికారులు, కింది స్థాయి ఉద్యోగులు, పాత్రికేయులు బాగా సహకరించారన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి: సిఐటియు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఫిబ్రవరి 6న సత్యసాయి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బావమ్మ, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి పాల్గొన్నారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్స్ కు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అంగనవాడీల సమస్యలపై నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, పార్వతమ్మ, నాగమణి, నీరజ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చి గెలుపొందిన సర్పంచులు గ్రామ పంచాయతీలలో నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామల్లో తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఏం చేయలేనపుడు మీరెందుకన్న నిలదీతలు గ్రామాల్లో పెరిగిపోతున్నా నేపథ్యంలో సర్పంచులు తమ పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మండలంలోని దేమకేతేపల్లి సర్పంచి నిధులు రాలేదని ఆగిపోలేదు. తన మాట మీద నమ్మకంతో ఓటేశారని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంకల్పించాడు. నిధులెలాగో రావు నిందలేందుకు అనుకున్నాడు. తనను నమ్మి ఓటేసిన ప్రజలకు మేలు చేయాలనుకున్నాడు. తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాడు. ఈ నేపథ్యంలోనే వై గొల్లపల్లిలో ఏళ్ల తరబడి ఉన్న తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి నడుం బిగించాడు. నూతన పైప్ లైన్ ఏర్పాటు చేశాడు. ఆర్డీటీ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు కేబుల్ వైర్ కొనుగోలు చేసి కొత్త వీధిదీపాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. తన పంచాయతీలో ఏ గ్రామంలో చిన్న సమస్య ఉన్న ఇచ్చిన మాట నిలుపుకునేందుకు చేతనైన పనులన్నీ చేస్తున్నాడు. ఇచ్చిన హామీ నిలుపుకునేందుకు సర్పంచు పడుతున్న ఇబ్బందులు చూస్తున్న గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గ్రామంలో నిర్వహిస్తున్న పైపులైను పనులు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్, సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దామని ఎపి మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం హిందూపురం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణంలో ఉన్నా అసోసియేషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మోహన్, ప్రధాన కార్యదర్శి నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్థానిక మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 5వ తేదిన జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలో చర్చించి, ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఐక్యంగా కలిసి సమస్యల పరిష్కారం కోసంఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిరాల చంద్ర, హిందుపురం మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షులు రామాంజనేయులు, హిందూపురం పట్టణ సచివాలయ అధ్యక్షులు జెపి రెడ్డి, మేనేజర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి రాము, షాకిర్, మనోహర్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పుష్పగుచ్చం అందిస్తున్న మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు



నిరసనలో పాల్గొన్న నాయకులు

యుటిఎఫ్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవితభద్రతకు ముప్పు వాటిల్లే సిపిఎస్ విధానం రద్దు తదితర డిమాండ్లతో శుక్రవారం విజయవాడలో యుటిఎఫ్ తలపెట్టిన బహిరంగసభను జరగకుండా నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఉపాధ్యాయ, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో బహిరంగసభను తలపెడితే దాన్ని ప్రభుత్వం అడ్డుకోవటం అమానుషమన్నారు. సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రతోపాటు జిల్లా నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, ఉపాధ్యక్షులు బాబు, కోశాధికారి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, హరికృష్ణ, రమీజా, మారుతీశ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : యుటిఎఫ్ నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ కదిరి జోన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిలు తాహెర్ వలి, డి శ్రీనివాసులు, జి ఆనంద్ ,వైవి సుబ్బారెడ్డి, వెంకటరమణ నాయక్ ,ఖాదర్బాషా, ఖాజా, మొయినుద్దీన్, భార్గవ, శివ, మహబూబ్ బాషా, ప్రసాద్, నాగరాజు నాయక్ అనిల్ కుమార్ నాయక్ గౌరీ శంకర్ మధుసూదన్ రావు 10 మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి 'సవితమ్మ' కు లేదు : వైసిపి

ప్రజాశక్తి -పెనుకొండ

ఎమ్మెల్యే శంకరనారాయణను విమర్శించే స్థాయి టీడీపీ నాయకురాలు, కురుబ కార్పొషన్ మాజీ ఛైర్పర్సన్ సవితమ్మ కు లేదని వైసిపి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు.శుక్రవారం పెనుకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ నాగలూరు బాబు, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, నగర పంచాయత్ ఛైర్మన్ ఫరూక్, సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. రాజకీయ గురువని సంబోధిస్తూ మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారధి పంచన చేరిన సవితమ్మ ఆయనకు వెన్నుపోటు పొడుస్తోందని ఆరోపించారు. కర్నాటక డీజిల్,పెట్రోల్ అక్రమ వ్యాపారం, క్వారీ, రైల్వే కాంట్రాక్టు పనుల్లో కోట్ల రూపాయల ప్రజా ధనం దోపిడీ చేసిన సవితమ్మ ఆమె భర్త వెంకటేశ్వరవు తమ అవినీతిని ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఇటీవల సిబిఐ అధికారులు సవితమ్మ ఇంట్లో సోదాలు నిర్వహించడం వారి అక్రమాలకు నిదర్శనం అని అన్నారు. అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యేను ఆయన సోదరులను విమర్శించడం ఆమె స్థాయికి తగదన్నారు.ఈ సమావేశంలో వైసిపి టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సెలర్లు రఘునాథ్ రెడ్డి, భాస్కర్ నాయక్ , రామాంజినేయులు వెంకటరామి రెడ్డి, శ్రీనివాసులు, మారుతీ, శ్యామ్ నాయక్, సోమశేఖర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రత్యేక హోదా సాధించడంలో టిడిపి, వైసిపి విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతం, తదితరులు

ధర్మవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను సాధించడంలో టిడిపి, వైసిపి విఫలమయ్యాయని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు మునుపు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూడో యాత్రను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. జనవరి 36 నుండి మార్చి 28వతేదీ వరకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల నుండి ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని దర్మవరంలో ప్రారంబించడం జరిగిందన్నారు. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో నేడు ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు, హిందూపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి కెటి. శ్రీధర్, ఐఎన్‌టియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అమీర్‌బాషా, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థనారాయణ, ముదిగుబ్బ, తాడిమర్రి మండల కన్వీనర్లు బాసినేని ప్రభాకర్, కాటమయ్య, నాయకులు వెంకటరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు నరేంద్ర, రంగనాథ్, సురేశ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి జంగం గౌతమ్ గుర్తు చేశారు. శుక్రవారం పరిగి మండలం సేవామందిర్ కెటి శ్రీధర్ నివాసంలో పెనుగొండ నియోజకవర్గం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనితీరు రోజురోజుకు దిగజారి పోతోందన్నారు. జూడో యాత్రను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మతతత్వ విభజన రాజకీయాల ద్వారా ప్రజలను విభజిస్తోందని అలాంటి పాలనకు స్వస్తి పలికే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇక రాష్ట్రంలో అయితే వైసీపీ పాలన పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి మద్దతు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి రాజధానిని సైతం ఏర్పాటు చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. ప్రజలను విభజించి పాలించే విధంగా మూడు రాజధానుల కోణాన్ని ముందుకు తీసుకొచ్చారని విమర్శించారు. ప్రస్తుతం మద్యం దందా, భూమాఫియా మధ్య రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆరోపించారు. అనంతరం గోడపత్రికలను విడుదల చేశారుచేశారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి మెంబర్ కెటి. శ్రీధర్, సోషల్ మీడియా అహ్మద్, పెనుగొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు, పరిగి మండల ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఎ.బ్లాక్ ప్రెసిడెంట్ వెంకట్రాంరెడ్డి, బి బ్లాక్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, మండల నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, నారాయణ, ఈశ్వరప్ప, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు

హిందూపురం : ద్విచక్ర వాహనాల దొంగల ముఠాతో పాటు నకిలీ ఆర్‌సిలు సిద్ధం చేయాడానికి ఉపయోగించే కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు నకిలీ ఆర్‌సిలను హిందూపురం పోలీసులు స్వాదీనం చేసుకుని 9 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం టూటౌన్ స్టేషన్‌లో హిందూపురం ఇన్‌చార్జ్ డిఎస్పీ యశ్వంత్, సిఐ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి అరెస్టు వివరాలను వెల్లడించారు. గత కొంత కాలంగా ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు ఎక్కువగా దొంగలించబడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. దీనిపై టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక నిఘా పెట్టారు. శుక్రవారం పట్టణంలోని సిపిఐ కాలనీ సమీపంలోని డంపిగ్ యార్డు వద్ద ఉన్నా అటవీ ప్రాంతంలో అనుమానంగా తిరుగుతున్న పులమితి అల్లాబకాష్, సయ్యద్ ఆసీఫ్, జబివుల్లా, మహమ్మద్ ఆదీల్ ఖాన్, సత్తార్ ఖాన్, నూర్ మహమ్మద్, అజీజ్ ఖాన్, షేక్ ముభారక్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీ అయ్యారు. వీరితో పాటు 36 ద్విచక్ర వాహనాలు, కంప్యూటర్, ప్రింటర్, కొన్ని నకిలీ ఆర్‌సిలను స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించిన సిఐ వెంకటేశ్వర్లు, సిబ్బందికి డిఎస్పి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఆవుల దొంగలు అరెస్టు

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆవులను చోరీ చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. మండలంలోని గాజుకుంటపల్లి, వేమారెడ్డి పల్లి, ముత్యాల చెరువు వద్ద ఆవులను చోరీ చేసిన వారిలో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి 1.25 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లు, రూ.2.10లక్షల విలువచేసే నాలుగు ఆవులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో జమేదారు వెంకట రాముడు, కిరణ్ కుమార్ రెడ్డి, కోలా అంజి, అస్లాం, లోకేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

రొద్దం : మండలకేంద్రంలోని దుకాణాలలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. నరసింహ ట్రేడర్స్, ఓం శ్రీ సాయి ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ ఎరువుల దుకాణాల్లో డిఎపి ఎరువును అధిక ధరలకు అమ్ముతున్నట్టు నిర్ధారించిన విజిలెన్స్ అధికారులు రెండు షాపుల నందు 3,10,500 రూపాయలు విలువ గల 11.5 టన్నుల డిఎపిని సీజ్ చేసినట్లు ఎఒ నివేదిత తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ విభాగం వ్యవసాయాధికారి వాసు ప్రకాష్ , విజిలెన్స్ విభాగం సబ్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణయ్య, ఎఒ నివేదిత, విస్తరణ అధికారి అంజాద్, హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరయ్య, కానిస్టేబుల్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషను కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ సిఐ శంకర్ నాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కర్నాటక మద్యం స్వాధీనం

పెనుకొండ : మండలంలోని మరువపల్లి క్రాస్ వద్ద శుక్రవారం కారులో తరలిస్తున్న కర్నాటక అక్రమ మద్యాన్ని పెనుకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హుసేన్‌పీరా తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని పైపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బాధితుడిని శుక్రవారం పరామర్శి:చారు. ఈసందర్భంగా రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశాని ఆదినారాయణ, గోకులం వెంకటేష్, దేవరాజ్, జి. సురేష్ బాబు, జి. రాంప్రసాద్, కమలాకర్, విష్ణు, ఉపేంద్ర, సుధాకర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న సామకోటి ఆదినారాయణ

కార్యాలయ ఇన్‌ఛార్జిని కలిసిన నాయకులు

కదిరి టౌన్ : తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శి, పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డిని మైనార్టీ నాయకులు, కదిరి పట్టణ అధ్యక్షులు బహుద్దీన్ శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా కదిరి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించినట్లు బాహుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు 14 వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, సోషల్ మీడియా ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి టౌన్ : బోయలను గిరిజన జాబితాలో చేర్చే అంశంపై ఆ సంఘం నాయకులు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులను శుక్రవారం కలిశారు. విజయవాడ లోని ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఆనంద్ శ్యాముల్ పిలుపుమేరకు వాల్మీకి బోయ కులస్తుల స్థితిగతులపై వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, హైకోర్టు అడ్వకేట్ రాజేశ్వరి, జక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు .

మాయమవుతోన్న మహావృక్షాలు



ట్రాక్టర్‌ద్వారా తరలిస్తున్న కలప

ప్రేక్షకపాత్రలో అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలో చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. మహావృక్షాలను సైతం పట్టుపగలే నేలమట్టం చేసి లక్షలాదిరూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఓ చెట్టును నరకాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. అటవీశాఖ అధికారులతో అనుమతి తప్పని సరి. కాని ఏ అనుమతి లేకుండానే వందల సంఖ్యలో చెట్లు నేలమట్టం చేస్తున్నారు. ప్రతిరోజు మండల కేంద్రం మీదుగానే యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా పెద్దపెద్ద వృక్షాల కలపను ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పూట కూడా పోలీస్ స్టేషన్ మీదుగా పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో తరలిస్తున్నారు. వీటిని కట్టెల కోత మిషన్ల వద్దకు తీసుకువెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే ఇటుక పట్టీల వద్ద ఇటుకను కాల్చేందుకు కట్టెలను వినియోగిస్తున్నారు. ఇటు ఇటుక బట్టీలు మొదలు కట్టెల కోత మిషన్ల వరకు అటవీశాఖ అధికారులు ప్రతి నెల మాముళ్లు తీసుకుంటూ మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్‌ద్వారా యథేచ్ఛగా కలప తరలిస్తుండగా 'ప్రజాశక్తి' ఫోటోలు తీస్తుండగా విషయం తెలుసుకున్న పోలీసులు కంటితుడుపు చర్యగా ఆ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అయితే రోజు కలపతరలిపోతున్న పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన అటవీశాఖ ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధి పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హిందూపురం : ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వైసిపి హిందూపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం బేవినహళ్లి పంచాయతీ నక్కలపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గడప గడపకు వెళ్లిజగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆనంద్, జెడ్పీటీసీ నాగభూషణ, మల్లేష్, నాయకులు పురుషోత్తంరెడ్డి, ఆనంద్ రెడ్డి, ఇలియాజ్, సోమశేఖర్ రెడ్డి, మూర్తి, చాంద్‌బాషా, బసప్ప, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గోరంట్ల : పభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనుగొండ శాసనసభ్యులు శంకర్ నారాయణ కోరారు ఈ సందర్భంగా మండలంలోని మందలపల్లి జ్వాలాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముసిలిరెడ్డి, జెడ్పీటీసీ జయరాం నాయక్, కన్వీనర్ లక్ష్మీనరసప్ప యాదవ్, సర్పంచ్ నర్సిరెడ్డి ఎంపీటీసీ ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

బుక్కపట్నం : పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాలు నివారిద్దామనిజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పరిసరాల శుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. శుక్రవారం డ్రై డే పాటించి సీజనల్ వ్యాధులపై అవగాహనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం అధికారి కుల్లాయప్ప నాయక్, వైద్యాధికారి మమత, హెల్త్ సూపర్వైజర్ లింగ రామ్మోహన్, హెల్త్ అసిస్టెంట్ మురళి గౌడ్, సిబ్బంది లక్ష్మీ నాయక్, విజయ్ కుమార్, రమణయ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

బుక్కపట్నం : ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో పాల్గొనే షూటింగ్ బాల్ జట్టు ఎంపికను శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేశారు. ఈ పోటీలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య ప్రారంభించగా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులలో 24 మందిని జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టుకు ఎంపిక చేసినట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పూల ప్రసాద్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10 వతేదీ నుంచి 12వ తేదీ వరకు కృష్ణాజిల్లాలోని హనుమాన్ జంక్షన్ లో జరిగే 41 వ రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు నాగరాజు, రేఖ, వినయ్ కుమార్, పీఈటీలు స్వర్ణ కుమారి, చెన్నమ్మ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రవికుమార్, వెంకటేశ్వర ప్రసాద్, ఆదినారాయణ, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జామీయ మసీదు ఆధీనంలో నడుస్తున్న అల్ హి లాల్ పాఠశాలలో శుక్రవారం ఉర్దు టీచర్స్ అసోసియేన్ కార్యదర్శి పఠాన్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉర్దూ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జామియా మసీదు ముతువల్లి ఆడీటర్ నూరుల్లా, హెచ్‌ఎం అక్బర్ షరీఫ్ చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ, ఉర్దు ఉపాధ్యాచ సంఘం నాయకులు అన్సార్, ఐనుద్దీన్,రియాజ్, హరి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై అవగాహన

గాండ్లపెంట : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సచివాలయ సిబ్బంది, ఎఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్వాడీ, ఆశావర్కర్లకు సుస్థిర అభివద్ధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో డి. అంజినప్ప, కదిరి ఉప గణాంక అధికారి శివ నాయక్, ఎస్ఒ నాగేందర్ హాజర్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామాలలో రక్తహీనత కలిగిన మహిళలు, పిల్లలు, గర్భిణులను గుర్తించి డిజిటల్ అసిస్టెంట్ వెల్ఫేర్ వద్ద పేర్లు నమోదు చేయించాలని సూచించారు.

కదిరి టౌన్ : ప్రభుత్వం నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను అధిగమిద్దామని ఎంపీడీవో సుధామణి, ఇఒఆర్‌డి అంజనప్ప పిలుపునిచ్చారు. మండలము పరిధిలోని ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు , డ్వాక్రా లీడర్లు , అంగన్ వాడీ వర్కర్లు , అంగన్ వాడి సూపర్ వైజర్లు , డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. స్థిరమైన అభివృద్ది లక్ష్యాలు అధిగమించేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంలో పనిచేయాలని సూచించారు.

బత్తలపల్లి : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు నెరవేర్చేందుకు సమన్వయంతో పని చేద్దామని డిఎల్‌డిఒ శివారెడ్డి సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కొరకు నిర్దేశించిన 8 సూచికలపై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో దేశచర్చ, అవగాహన కార్యక్రమం ఎంపిడిఒ సాయిమనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, గ్రామసంఘం లీడర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి వద్ద కెజిబివిలో నాడు నేడు రెండో విడత కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి ఎంపిపి జగన్మోహన్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఈ పాఠశాలలోనూ మొదటి విడత లో అదనపు గదులను 45 లక్ష రూపాయల అంచనా వ్యయంతో నిర్మించామన్నారు. ఇప్పుడు రెండో విడత కింద 95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అదనపు గదులను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణనాయక్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, ఎస్ఒ దుర్గ, స్థానిక సర్పంచి గంగోజమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరులో చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 వ సంవత్సరంలో మూడు కోట్ల రూపాయల నిధులతో కళాశాల నూతన భవనం మంజూరు కాగా మూడంతస్తుల్లో గోడలకు మాత్రమే పరిమితమైందన్నారు. ఇప్పటివరకు భవనానికి 65 లక్షల రూపాయలు మంజూరు కాగా గుత్తేదారులకు నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం ఉన్నపలంగా ఆగిపోయిందన్నారు. అప్పటినుంచి కాంట్రాక్టర్లు మారినా నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం అలాగే ఉండిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేసి కళాశాల భవనం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్‌బాషా, గొర్లకృష్ణ , సాదక్ వలి, ఈశ్వరయ్య, మాజీ ఎంపీటీసీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి



బీమా కంపెనీ అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 11న జరిగే మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి జీవిత బీమా కంపెనీలు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శుక్రవారం స్థానిక ఎడిజె కోర్టు ఆవరణంలో జీవిత బీమా సంస్థల న్యాయవాదులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌లో జీవిత బీమా కేసులకు సంబంధించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సాధ్యమైన మేర అధికంగా కేసులను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక న్యాయమూర్తి ఆనందతీర్థ, జీవిత బీమా సంస్థల న్యాయవాదులు రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, కోదండ రామారావు, లోక్ అదాలత్ శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సేవలు వివరించాలి

గోరంట్ల : ప్రభుత్వం అందజేస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే శంకరనారాయణ సూచించారు. పట్టణంలో ఎస్ ఎల్ వి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు, వాలెంటీర్లతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అందిస్తున్న సేవలను కొత్తగా నియమించబడిన గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లతో కలసి ప్రజలకు వివరించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప యాదవ్, జెడ్పీటీసీ జయరాం నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, మైనార్టీ స్టేట్ డైరెక్టర్ ఫక్రుద్దీన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూర్ మహమ్మద్, సర్పంచులు ప్రభాకర్ రావు, నర్సిరెడ్డి, రామాంజనేయులు, నాగే నాయక్, శివ శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ నందు మున్సిపాలిటీ లోని 13 నుండి 26వ సచివాలయాల పరిధిలో గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కదిరి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర జానపద, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను నేరుగా వారి ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరికి సాదిక్, వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండి ఇస్మాయిల్, వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి ఆవుల వెంకటనారాయణ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి